# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 67 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 5-6 -2025 | వెల : .రూ. 5.00





## ఆర్‌సీబీ విజయోత్సాహంలో
# ఘోర విషాదం

### ఘటనలో పదిమంది మృతి....50మందికి గాయాలు

- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట
- భారీగా తరలివచ్చిన అభిమానులతో స్టేడియం వద్ద తోపులాట
- ఆర్‌సిబి విజయోత్సవ సభలో అపశృతి
- కంట్రోల్ చేయలేక చేతులెత్తేసిన బెంగళూరు పోలీసులు
- బెంగుళూరు చేరుకున్న ఆర్‌సీబీ జట్టుకు డిప్యూటి సీఎం స్వాగతం

జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) బెంగళూరు,
బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం దగ్గర అపశ్రుతి చోటు చేసుకుంది. ఆర్‌సిబి విజయోత్సాహంలో విషాదం చోటుచేసుకుంది. క్రికెటర్ల విజయోత్సవాతన్ని కళ్లారాచూడాలని తరలివచ్చిన అభిమానుల తోపులాట తొక్కిసలాటకు దారితీసింది. ఈ క్రమంలో పదిమంది మృత్యువాతపడ్డారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్పు సాధించిన ఆనందంలో అభిమానులు భారీగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ భారీగా తొక్కిసలాట జరిగింది. చిన్నస్వామి స్టేడియం లోపలికి అభిమానులు తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను


-మిగతా 2 లో





## పాలన చేతకాని
# కాంగ్రెస్ పార్టీ

- వేములవాడ కోడెల మృతి దారుణం
- ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) సిద్దిపేట
కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది అస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని

-మిగతా 2 లో

## నెరవేరనున్న
# ఆదర్శ రైతుల కల !

### ఈరోజు కేబినెట్ ముందుకు ఆదర్శ రైతుల నియామక అంశం

- వేతనం లేకుండా ఆదర్శ రైతుల నియామకం దిశగా ప్రభుత్వం అడుగులు
- రాష్ట్ర వ్యాప్తంగా 10,000 ల మంది ఆదర్శ రైతుల ఎదురుచూపులు.
- క్షేత్ర స్థాయిలో మరింత బలపడనున్న వ్యవసాయ శాఖ.

హైదరాబాద్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
2007 వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆదర్శ రైతుల వ్యవస్థ తదుపరి ఏడు సంవత్సరాల కాలం పాటు రాష్ట్ర రైతాంగానికి విశేషమైన సేవలను అందించింది. అనంతరం రాష్ట్ర రాజకీయాలలో జరిగిన అనూహ్యమైన మార్పుల కారణంగా 2014 లో ఏర్పడ్డ బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నఫలంగా ఆదర్శ రైతు వ్యవస్థను రద్దు చేసి అప్పటివరకు రాష్ట్ర రైతాంగానికి సుదీర్ఘమైన సేవలందించిన సుమారు

-మిగతా 2 లో



## జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

- ఆపరేషన్ సిందూర్‌పై చర్చ
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీలు డిమాండ్
- జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు సమావేశాలు



జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) న్యూఢిల్లీ,
పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలను ఖరారు చేసింది.జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకూ

-మిగతా 2 లో



## రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..

- రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..
- కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్ జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని.. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ గారు చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో

-మిగతా 2 లో

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం
# మా బాధ్యత

- క్యాబినెట్ సమావేశంలో నివేదిక సమర్పిస్తాం, పరిష్కారం కనుగొంటాం
- ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్,
ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా ప్రభుత్వం బాధ్యత, సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్

-మిగతా 2 లో

## 2027 మార్చి 1 నుంచి
# జనాభా లెక్కల సేకరణ

- అప్పుడే కులగణన కూడా జరిగే అవకాశం
- కేంద్ర అధికార వర్గాల వెల్లడి



జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) న్యూఢిల్లీ
దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెరపడనుంది. జనగణనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం సన్నద్ధమవుతోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కులగణన

-మిగతా 2 లో

# ఆర్‌సీబీ విజయోత్సాహంలో ఘోర విషాదం

(మొదటి తరువాయి)

తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేకపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పది మంది మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు.వారిని వివిధ అస్పత్రులకు తరలించారు.అభిమానులను నియంత్రించేందు కు చిన్నస్వామి స్టేడియం దగ్గర పోలీసులు లాఠీఛార్జ్ ప్రారంభించారు. స్టేడియం ఖాళీ చేయాలని అభిమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటు-న్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

# జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

(మొదటి పేజి తరువాయి)

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఈ సమావేశాల్లో పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై చర్చించనున్నట్లు తెలిసింది. అంతేకాదు 23 రోజుల పాటూ జరిగే ఈ సమావేశాల్లో కీలకమైన బిల్లులను కూడా కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. జాతీయ భద్రత, ఆర్థిక స్థితిగతులపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**ప్రధానికి ఎంపీల లేఖ..**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ వైమానిక స్థావరాలను తుత్తునియలు చేసింది. మన ఆర్మీ విజయం ముంగిట ఉందనగా.. కేంద్రంలోని మోదీ సర్కారు కాల్పుల విరమణకు అంగీకరించింది. దీంతో ఈ వ్యవహారంపై యావత్తు జాతి జనుల్లో ఎన్నో ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. దీనిపై ప్రధాని మోదీ సహా ప్రభుత్వ పెద్దలు ఎవ్వరూ నోరుమెదపడం లేదు. దీంతో పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షానికి చెందిన 16 పార్టీల ప్రతినిధులు ప్రధాని నరేంద్రమోదీకి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖపై లోక్‌సభకు చెందిన 200 మందికి పైగా విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు.

**వేటిపై చర్చకు పట్టుబట్టారంటే?**

పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీల నేతలు మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. సరిహద్దు గ్రామాల్లో పాక్ రేంజర్లు జరిపిన షెల్లింగ్‌లో ప్రాణాలు విడిచిన పౌరుల గురించి కూడా చర్చించాలని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తదనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో తమ ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వానికి మద్దతునిచ్చాయన్న విపక్ష నేతలు.. తమ డిమాండ్ మేరకు కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# నెరవేరనున్న ఆదర్శ రైతుల కల !

(మొదటి తరువాయి)

16,000 ల మంది రైతుల సేవలను ప్రభుత్వం విస్మరించింది. దీంతో అప్పటివరకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులకు శాఖా పరమైన అన్ని పనులలో చేదోడు వాదోడుగా ఉంటూ, రైతు సమావేశాల నిర్వహణ, పంట ప్రయోగాల పర్యవేక్షణ, నూతన వంగడాల సాగు, మట్టి పరీక్షలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే పంట నష్టం సర్వే , వివిధ ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలలో గ్రామస్థాయిలో కీలకంగా వ్యవహరించిన ఆదర్శ రైతు వ్యవస్థ రద్దుతో వ్యవసాయ శాఖకు ఎదురుదెబ్బ తగిలినట్లయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వము ఏర్పాటు చేసిన వెంటనే ఆదర్శ రైతు వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ చేస్తామని హామీ ఇచ్చి పార్టీ మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని ప్రకటించింది. పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఈరోజు సీఎం అధ్యక్షతన జరగబోయే కేబినెట్ సమావేశంలో ఆదర్శ రైతుల నియామకంపై చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులు, మంత్రులు, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులతో పలుమలు జరిపిన చర్చల్లో భాగంగా గౌరవ వేతనం లేకున్నా రైతుల సంక్షేమం దృష్ట్యా విస్తృతమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర ఆదర్శ రైతుల సంఘం ప్రకటించిన విషయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కసిరబోయిన లింగయ్య యాదవ్ ధ్రువీకరించారు. దీంతో వానకాలం సీజన్ ప్రారంభంకు ముందే ఆదర్శ రైతులను నియమించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వీరికి ఎలాంటి గౌరవ వేతనం లేకుండానే వీరి సేవలను వినియోగించుకోవాలి అనే ఉద్దేశంతో ప్రభుత్వంలో చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటం, గ్రామస్థాయిలలో సహాయకులు లేకపోవడం వంటి కారణాలవల్ల వ్యవసాయ విస్తరణ అధికారులపై పెరిగిన పని ఒత్తిడిని తగ్గించే దిశగా ఆదర్శ రైతుల నియామకం చేపట్టి రైతువేదికల నిర్వహణ, మట్టి పరీక్షలు చేపట్టడం, రైతు నేస్తం సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, వివిధ ప్రభుత్వ పథకాలకు రైతుల ఎంపిక తదితర విషయాలలో వ్యవసాయ విస్తరణ అధికారులకు సహకరించేలా సుమారు 20 రకాల విధులతో వీరి జాబ్ చార్ట్ రూపొందించే దిశగా ప్రభుత్వం సూచనలు చేస్తున్నట్టు తెలుస్తుంది. రాష్ట్రం లో ఆదర్శ రైతు వ్యవస్థను తిరిగి నియమించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల 10,000 ల మంది ఆదర్శ రైతుల సంఘం ప్రతినిధులతో పాటుగా, రాష్ట్ర రైతాంగం మరియు వ్యవసాయ శాఖ అధికారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

(మొదటి పేజి తరువాయి)

అంబేద్కర్ సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై మీ అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల కమిటీకి సూచించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించారు. మీ వద్ద స్వీకరించిన సమాచారాన్ని కమిటీకి పలు దఫాలుగా వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేకపోయాం, ఇక ఎక్కువ కాలం పెండింగ్లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలనదే ప్రభుత్వ ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాలకు వివరించారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో అధికారుల నివేదికతో పాటు నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములు గా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నిటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని డిప్యూటీ సీఎం వివరించారు. ఒకవైపు ప్రజలకు మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశమైనట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. గత పది సంవత్సరాల పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి అయినప్పటికీ ఉద్యోగులకు సాధ్యమైనంత మేరకు మేలు చేయాలి, వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో భాగంగానే మా ప్రభుత్వం రాగానే మొదటి తారీకు నే జీతాలు చెల్లిస్తుందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, కొత్త పథకాలు పెద్ద సంఖ్యలో తీసుకువచ్చాం, విజయవంతంగా అమలు చేస్తున్నాం వీటికి తోడు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్న తపనలో ప్రజా ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

వనరులు సమకూర్చుకొని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకు పోతున్నాం అదే నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నాం ఈ కసరత్తు విజయవంతం కావాలని మనసున్న ప్రభుత్వం కోరుకుంటుందని వివరించారు. ఉద్యోగులకు మంచి చేయాలన్న ఆలోచనతోనే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని వివరించారు.

ప్రభుత్వ ఆదాయానికి మరియు ఖర్చుకు చేయాల్సిన పనులను బేరీజు వేసుకొని ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి బలంగా ఉన్నారని డిప్యూటీ సీఎం ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై క్యాబినెట్ సహచరులం అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న అంశంపై ఎవరికీ భిన్నాభిప్రాయం లేదని తెలిపారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో ఉద్యోగ సంఘాల సమస్యలపై ఏర్పాటు చేసిన అధికారుల త్రీ మెన్ కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి క్యాబినెట్ కు నివేదిస్తాం, పరిష్కారం కనుగొంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఉద్యోగ సంఘాల నేతలకు వివరించారు. సమావేశం లో అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణభాస్కర్, సందీప్ కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.

# పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ

(మొదటి తరువాయి)

మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

## 2027 మార్చి 1 నుంచి

# జనాభా లెక్కల సేకరణ

(మొదటి పేజి తరువాయి)

కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు- కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ పక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు- తెలుస్తోంది.

# రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..

(మొదటి పేజి తరువాయి)

నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జు ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండే కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి - పెన్నా అనుసంధానం పేరిట నీళ్లు తరలింపును తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు.

# పాక్‌కు సమాచారం చేరవత

**న్యూఢిల్లీ,జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నాడనే ఆరోపణతో జస్బీర్ సింగ్ అనే యూట్యూబర్‌ని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'జాన్ మహల్' అనే పేరుతో జస్బీర్ యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నాడు. ఆ ఛానల్‌కి 1.1 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అయితే నిందితుడికి పాకిస్థాన్ ఇంటెలిజన్స్ అధికారి, ఐఎస్‌ఐకు పని చేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షకీర్ అలియాస్ జుట్ రాంధావాతో సంబంధాలు ఉన్నట్లు- తెలిసింది. పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహిం అలియాస్ డానిష్‌తో కూడా ఇతనికి పరిచయం ఉంది. అంతేకాక.. ఇటీవల గూఢచర్యం కేసులో అరెస్ట్ అయినా హరియానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో కూడా ఇతనికి దగ్గర సంబంధాలు ఉన్నట్లు- తేలింది. డానిష్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో జరిగిన జాతీయ దినోత్సవానికి కూడా జస్బీర్ హాజరైనట్లు- పోలీసులు తెలిపారు. అంతేకాక నిందితుడు 2020, 21, 24లో పాకిస్థాన్‌లో పర్యటించాడని పేర్కొన్నారు. నిందితుడి నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు- తెలిపారు. వాటిని ఫొరెన్సిక్ లాబ్‌కు తరలించగా.. శత్రుదేశానికి చెందిన అనేక నెంబర్లు బయటపడ్డాయని తెలిపారు.

## 2025 జూన్ 5, గురువారం తెలుగు పంచాంగం




**మాసం - పక్షం**
మాసం: జ్యేష్ఠమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
**తిథి**
దశమి: జూన్ 4, రాత్రి 11:54 నుండి జూన్ 6, తెల్లవారుజామున 2:16 వరకు
**నక్షత్రం**
హస్త: జూన్ 5, తెల్లవారుజామున 3:35 నుండి జూన్ 6, ఉదయం 6:33 వరకు
**సూర్యోదయం - సూర్యాస్తమయం**
సూర్యోదయం: ఉదయం 5:45
సూర్యాస్తమయం: సాయంత్రం 6:44
**చంద్రోదయం - చంద్రాస్తమయం**
చంద్రోదయం: మధ్యాహ్నం 12:12
చంద్రాస్తమయం: రాత్రి 1:19
**శుభ సమయాలు**
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:48 నుండి 12:40 వరకు
అమృతకాలం: రాత్రి 11:49 నుండి 1:37 వరకు (జూన్ 6)
**అశుభ సమయాలు**
రాహుకాలం: మధ్యాహ్నం 1:52 నుండి 3:29 వరకు
యమగండం: ఉదయం 5:44 నుండి 7:22 వరకు
గులిక కాలం: ఉదయం 8:59 నుండి 10:37 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 1:02 నుండి 2:49 వరకు

# ఆసుపత్రుల్లో పారదర్శకత, మర్యాదతో సేవలందించాలి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**కరీంనగర్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని ఆసుపత్రి పనితీరుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదతో వ్యవహరించాలన్నా, పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలన్నా ఆయన స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాతా శిశు ఆసుపత్రుల్లో పారిశుధ్య స్థాయి ఆశించినంతగా లేదని కలెక్టర్ తెలిపారు. తక్షణం మెరుగులు తీసేలా చూడాలని, లేకపోతే పారిశుధ్య కాంట్రాక్టర్‌కి చెల్లింపులు నిలిపివేయబడతాయని హెచ్చరించారు. రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బంది తీరును పరిశీలించాలని, పనితీరులో మార్పు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి నేపథ్యంలో హాజరు పర్యవేక్షణకూ ప్రాముఖ్యత ఇవ్వాలని, వైద్య సిబ్బంది హాజరును బయోమెట్రిక్ ద్వారా నిర్ధారించే విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. రోజూ హాజరు నివేదిక సమర్పించాలని, ఆసుపత్రుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. మంథని పట్టణంలో రూ.26 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, పెద్దపల్లి పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో వర్షాకాలానికి ముందే ఒక బ్లాక్ సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమీక్షలో డీసీహెచ్‌ఓ శ్రీధర్‌తో పాటు ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయ స్వామి నూతన కమిటీ డైరెక్టర్లను ఘనంగా సన్మానించి డా. ఉక్కుల అశోక్



**హైదరాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కర్మన్ ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయం లో తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డా. ఉక్కుల అశోక్ స్వామివారికి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. కార్యక్రమానంతరం దేవస్థానానికి నూతనంగా నియమితులైన కమిటీ డైరెక్టర్లు తోకటి కిరణ్ కుమార్ మరియు కొండ్ర సంతోష్ కుమార్ ని డా. ఉక్కుల అశోక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “దేవస్థాన అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆశిస్తున్నాం. భక్తులకు మరింత మంచి సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# సివిల్స్ ర్యాంకర్ భరద్వాజ్ ను ఘనంగా సన్మానించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్ నగర్ పట్టణానికి చెందిన మాజీ సీపీడీఓ నాగమణి కుమారుడు భరద్వాజ్ సివిల్స్ ఫలితాలలో 905 ర్యాంక్ సాధించిన సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ ,కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలపడం జరిగింది. షాద్ నగర్ పట్టణం చెందిన వారు ఐఏఎస్ గా, గ్రూప్ వన్ లో కూడ సెలెక్ట్ కావడం సంతోషకరమని అన్నారు. యువత భరద్వాజ్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఇటీవల కాలంలో షాద్ నగర్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సివిల్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,కేశం పెట్ మాజీ జడ్పీటీసి విశాల శ్రవణ్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, నేతలు కృష్ణ రెడ్డి,కొంకళ్ళ చెన్నయ్య, అగ్గనూర్ బస్వం, శ్రీశైలం గౌడ్,రాజు నాయక్, విజయ్ కుమార్ రెడ్డి, బుచ్చయ్య, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్,మున్నా తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

-ఫరూక్ నగర్ తహసిల్దార్ పార్థసారథి
- ఎలికట్టలో తాసిల్దార్ పార్థసారథి ఆధ్వర్యంలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సు
-శేరిగూడలో డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ ఆధ్వర్యంలో సదస్సు



**ఫరూఖ్ నగర్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఫరూక్ నగర్ మండల తహసిల్దార్ పార్థసారథి తెలిపారు. బుధవారం మండలంలోని ఎలికట్టలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సు ప్రారంభమైంది. అదేవిధంగా మండలంలోని శేరిగూడ గ్రామంలో డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రైతులు సందేహాలను సదస్సుల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలను చేసారు. డాక్యుమెంట్లు లేనివారు మరియు పూర్వం తప్పులు పడిన వాటికి సంబంధించినవి అనేక సమస్యలు ప్రజలు రెవెన్యూ సదస్సులో దృష్టికి తీసుకువస్తున్నారని వారు పేర్కొన్నారు. రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపుగా పరిష్కరించే విధంగా సదస్సులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఏ విధంగా పరిష్కారం చేయాలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సదస్సులు ఉపయోగపడతాయో వాటి తీరును వివరించారు. ఇప్పటికే కిందిస్థాయి సిబ్బందికి సూచనలు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భూ సమస్యలపై ఎక్కువగా తప్పుల సవరణలు, విరాసత్ పిటిషన్లు వస్తున్నాయని తెలిపారు. మరికొన్ని భూ సమస్యలకు సంబంధించిన సమస్యలు రెవెన్యూ దృష్టికి తీసుకువస్తున్నారని తహసిల్దార్ పార్థసారథి, డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ లు తెలిపారు. అదేవిధంగా శేరిగూడలో డిప్యూటీ తహసిల్దార్ ఆనంద్ సింగ్ ను కలిసి గ్రామస్తుల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని మండల మాజీ జెడ్పిటిసి పి వెంకట్రామిరెడ్డి అందజేశారు. మానవతా దృక్పథంతో సమస్యలను నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకొని పట్టాదారు, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు ఆయన సూచించారు..

# ఘనంగా మండల ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి జన్మదిన వేడుకలు



**పేగడపల్లి, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జగిత్యాల జిల్లా పేగడపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు సంధి మల్లారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, కడారి తిరుపతి, తడగొండ రాజు, జితేందర్ గౌడ్, చెట్ల కిషన్, దికొండ మహేందర్, తడగొండ తిరుపతి, పల్మారు అంజయ్య, గర్వంద రమేష్ గౌడ్, బొమ్మగోని రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వంశీచందర్ రెడ్డి జన్మదిన వేడుకలు


-పుట్టినరోజు సందర్భంగా ఆమనగల్‌లో సేవా కార్యక్రమాలు






**ఆమనగల్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, డీలిమిటేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు వంశీచందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు ఆమనగల్ పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్ ఆధ్వర్యం వహించారు. జన్మదిన సందర్భంగా వంశీచందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి, పండ్లు పంచుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అదే తరహాలో పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని చెట్లను నాటే కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు యాట నరసింహ హాజరై వంశీచందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పాల్గొన్నారు. వారిలో మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షులు మానయ్య ఖలీల్, డైరెక్టర్ శ్రీశైలం, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఎంపీపీ అనిత, విజయ్, కృష్ణ నాయక్, జిల్లా నాయకులు కొండల్ రెడ్డి, ఎంగాలి ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, అలీమ్, అబ్దుల్ ఖాదర్, నరసింహ, ఖాదర్, ఖాద్రి, ఫరీద్, దేవరశెట్టి మహేష్, కాలె మల్లయ్య, ప్రసాద్, సురేష్, కరీం, రహీం, షాబుద్దీన్, శీను, గౌస్, కుమార్ గౌడ్, సురేష్ నాయక్, కండె సాయి, కాలే మల్లయ్య, శ్రీను నాయక్, అంజద్, రఫీ, మజ్జిద్ తదితరులు పాల్గొన్నారు. వంశీచందర్ రెడ్డి నాయకత్వ లక్షణాలను కొనియాడుతూ, ప్రజాసేవలో ఆయన చూపుతున్న నిబద్ధతను కొనియాడారు.

# నాగిళ్ళలో 21 ఏళ్ల యువకుడు అదృశ్యం



**మాడుగుల, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాడుగుల మండలంలోని నాగిళ్ళ గ్రామానికి చెందిన మహమ్మద్ మహమూద్ తన కుమారుడు మహమ్మద్ అబ్దుల్ రహమాన్ (21) అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూన్ 4, 2025 ఉదయం 5:30 గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిన అతను ఇప్పటికీ తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్ రహమాన్ ఆరు అడుగుల ఎత్తు,గుండ్రటి ముఖం,తెలుపు రంగు కలిగి ఉన్నాడు. అదృశ్యమైన సమయంలో బూడిద రంగు అంగి, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఈ ఘటనపై మాడుగుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అతని గురించి ఎవరైనా సమాచారం తెలిసినట్లయితే,మాడుగుల పోలీస్ స్టేషన్ నెంబర్ 8712662674 లేదా ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వేణుగోపాల్ 8712662365 కు ఫోన్ చేసి తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# వనస్థలిపురం సీఐగా బాధ్యతలు స్వీకరించిన టి మహేష్ గౌడ్




**వనస్థలిపురం, జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో టి మహేష్ గౌడ్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నేర నియంత్రణ,ట్రాఫిక్ నిర్వహణ,ప్రజా సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై దృష్టి సారించనున్నట్లు ప్రకటించారు. టీఆర్‌ఎస్వీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గుండుమల్ల పాండుగౌడ్, టీఆర్‌ఎస్వీ నేతలు మహేష్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు పరిష్కారకరమైన విధానాలను అమలు చేస్తామని మహేష్ గౌడ్ పేర్కొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**


# భూభారతితో ధరణి కష్టాలు మటుమాయం





**పోరండ్ల, జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

పోరండ్ల రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధ సమస్యలు భూ భారతి చట్టంతో సమసిపోతాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెచ్చిన ధరణి వల్ల రైతులు పడిను కష్టాలు ఇన్నీ,అన్నీ కావన్నారు. ధరణి లోని లొసుగులను అవకాశంగా చేసుకొని గ్రామాల్లో కొందరు ఆక్రమణలకు తెగబడ్డారని, కాగా మరికొందరు అక్రమ బదలాయింపులకు పాల్పడ్డారన్నారు. దీంతో గ్రామాల్లో భూవివాదాలు పెచ్చుమీరిపోయాయని, హత్యలకు దారితీసిన సంఘటలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. దరణిలోని లోపాల కారణంగా రైతులు,భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టంతో రైతుల చిక్కులు తీరుతాయన్నారు. పదేళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని ఆయన వివరించారు.రైతులకు భూభారతి వరం లాంటిదని ఆయన పేర్కొన్నారు. రైతులకు సర్వరోగ నివారణిగా భూభారతి పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా భూసంబంధ సమస్యలు ఉంటే ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో తిమ్మాపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఉప తహసీల్దార్ రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము, పోలు రమేశ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారమే సర్కార్ ధ్యేయం

**మానకొండూర్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ శాసనసభ్యుడు డాకట్ర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. ఈ పథకం కింద విడతల వారీగా అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగ జరుగుతుందని,




ఇందులో అవకతవకలకు, అవినీతికి తావులేదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గూడులేని పేదలకు ఇళ్లు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని ఆయన వివరించారు. నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేయడమే ఈ పథకం ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి రామానుజాచారి,పీడీ గంగాధర్, గృహనిర్మాణ సంస్థ ఏఈ మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమెర రవీందర్ రెడ్డి, మాతంగి అనిల్, మార్గం మల్లేశం, చంద్రారెడ్డి తోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**పార్వెల్లలో రెవెన్యూ సదస్సు**

గన్నేరువరం మండలం పార్వెల్ల గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి





**ఇబ్రహీంపట్నం జూన్ 04(నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**

ఆరాంఘర్ చౌరస్తా క్వీన్ కన్వెన్షన్ లో ఇబ్రహీంపట్నం మాజీ ఎంపిపి కృపేష్ సోదరుడు భరత్ వివాహానికి , యాచారం సాయిశరణం గార్డెన్ లో బిఆర్ఎస్ యువజన నాయకుడు భరత్ గౌడ్ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి . మరియు జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి , సొసైటీ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి , మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్వకోల్ రవీందర్ రెడ్డి , మాజీ కార్పోరేటర్లు సూర్ణగంటి అర్జున్ , రవి , మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు , మాజీ సర్పంచ్ నాగరాజు గౌడ్ , బిజెపి నాయకుడు తాంద్ర రవీందర్ బిఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

# కందికట్కూర్ లో బోనాల జాతర





**ఇల్లంతకుంట, జూన్ 4( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎల్లమ్మతల్లి బోనాల జాతర కు మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్లమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు,దేవస్థానం కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి, పార్టీ నాయకులు గుడిసె అయిలయ్య యాదవ్, ఆకుల సత్యం,అమర్, యాస తిరుపతి, విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భూమిపూజ అనంతరం తాళ్ళపల్లి లావణ్య-శ్రీధర్ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి, పార్టీ నాయకులు గుడిసె అయిలయ్య యాదవ్, ఆకుల సత్యం,అమర్, యాస తిరుపతి, బిగుళ్ల రజనీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించిన భీమ్ భరత్

**చేవెళ్ల,జూన్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని లబ్ధి దారులకు చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేన భీమ్ భరత్ నియామక పత్రాలు ఇచ్చి ప్రారంభించారు. ఈ స్కీమ్ ద్వారా అర్హులైన పేదలందరికీ సొంత ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను కేటాయించింది. కాగా మొదటి విడతలో సొంత జాగా ఉన్నవారికే ఇండ్లను కేటాయిస్తోంది ప్రభుత్వం. వచ్చే విడత నుంచి ఇంటి స్థలం లేని వారికి ప్లాట్ మంజూరు చేసి రూ. 5 లక్షలతో ఇల్లు నిర్మించనుంది అని తెలియజేశారు మరియు ఎస్టీ,ఎస్టీ వర్గాలకు చెందిన అదనంగా రూ. లక్ష సాయం అందించనున్నట్లు తెలిపారు. అంటే బీసీ, మైనార్టీ వర్గాలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు సాయంగా అందిస్తుంటే, ఎస్సీ, ఎస్టీలకు మాత్రం రూ. 6 లక్షలు సాయం అందించనున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లోనూ ఈ వాగ్ధానం చేసింది. ఇందిరమ్మ ఇండ్లు స్కీమ్ ద్వారా ఇల్లు కట్టుకునేందుకు ఎస్టీ, ఎస్టీలకు రూ. 6 లక్షలు, ఇతరులకు రూ. 5 లక్షలు సాయంగా అందిస్తామన్నారు ఇప్పుడు అందుకు అనుగుణంగానే హామీని అమలు చేస్తోంది అని కొనియాడారు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను మహిళల



పేరు మీదే అందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మహిళలు సంతోషంగా ఉంటే రాష్ట్రం బాగున్నట్లే అని పేర్కొంది. అందుకే ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మహిళ పేరు మీద మంజూరు చేయనున్నట్లు తెలిపారు... ఈ కార్యక్రమంలో పాటుగా పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్ మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త జైపాల్ రెడ్డి కుమ్మరి వెంకటేష్ మాజీ సర్పంచులు సత్యనారాయణ వీరభద్ర స్వామిమాడి వెంకట్ రెడ్డి . కరణ్ కుమార్ ఎంపీటీసీలు కేబుల్ రాజు ఇందిరమ్మ కమిటీ మెంబర్మాణిక్ రెడ్డి విజేందర్గణేష్ కెయాదయ్య సర్దార్ నగర్ మార్గం కమిటీ మెంబర్ బాలకృష్ణారెడ్డి జైపాల్ రెడ్డి విలేజ్ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి శ్రీపాల్ రెడ్డి నర్సింగ్ రావు నియోజిన్. ఈరన్నపేట్ నాగరాజు బిక్షపతి శ్రీనివాస్ రెడ్డి అశోక్ నాగిరెడ్డి గూడా గ్రామ కమిటీ అధ్యక్షులు విజయరాజ్. కనగల రాజుయూత్ కాంగ్రెస్ నరేందర్ గౌడ్మాడు జయపాల్ రెడ్డి హరేందర్చందానగర్ ఎంపీటీసీ గణేష్ గౌడ్ ,

ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఉచిత ఓపి సేవలు అందించండి

-ఐఎంఎ జిల్లా అధ్యక్షుడిని కోరిన ప్రెస్ క్లబ్ కమిటీ



**వనపర్తి, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వనపర్తి జిల్లా వర్కింగ్ జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత ఓపి సేవలు అందించాలని ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. బుధవారం, వారు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీజే బాబును కొత్తకోటలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజ హితం కోసం నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులకు ఐఎంఎ తరఫున సహకారం అందించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత ఓపి సేవలు అందించడంతో పాటు, వైద్య పరీక్షలపై 50 శాతం రాయితీ, మందుల కొనుగోలుపై 25 శాతం రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఐఎంఎ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పీజే బాబు సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే జిల్లాలోని వైద్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. జర్నలిస్టులకు ఐఎంఎ తరఫున హెల్త్ కార్డులు అందించే విధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ప్రెస్ కమిటీ సభ్యులు బోలేమోని రమేష్, కొండన్న యాదవ్, లక్ష్మణ్, ఖలీల్, యాదిరెడ్డి, గంధం దినేష్, కుమార్, తిరుపతి, శ్రీనాథ్, మల్లికార్జున్, పురుషోత్తం, తరుణ్, గోపాలకృష్ణ, రవికుమార్, రాజు, రాజ్ కుమార్, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువవికాసం నిరుద్యోగుల ఉపాధికి ఊతం

రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



**రంగారెడ్డి,జూన్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిరుద్యోగ యువతకు ఊతం కాంగ్రెస్ ప్రభుత్వం అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం ఒక ప్రకటనలో.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక పదేండ్లలో గత బీఆర్ఎస్ సర్కారు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వలేదు అని ఏడాదికి ఒకటో.. రెండో ఇచ్చినా.. అందులో కొన్ని పేపర్‌లీక్స్‌తో వాయిదాపడుతూ వచ్చాయి. దీంతో ప్రత్యేక రాష్ట్రంలో నిరుద్యోగుల ఆశలు అడియాశలే అయ్యాయి. మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి తోవ చూపేందుకు గత బీఆర్ఎస్ సర్కారు కార్పొరేషన్ రుణాలను కూడా ఇవ్వలేదు. అటు ఉద్యోగాలు లేక.. ఇటు ఉపాధి లేక నిరుద్యోగుల జీవితాలు నీరుగారిపోయాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కంకణం కట్టుకున్నది. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూనే.. మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి తోవ చూపేందుకు రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనుకబడిన వర్గాల యువతకు ఆర్థిక సహాయం అందించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. గతానికి భిన్నం రూ. 50 వేల నుంచి రూ. 4లక్షల వరకు సాయం అందించేందుకు నిర్ణయించింది. నిరుద్యోగులపై భారం లేకుండా గతంలో ఉన్న సబ్సిడీని రివర్స్ చేసి.. 70 శాతం ప్రభుత్వం, 30 శాతం లబ్ధిదారుడు భరించేలా విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నది. రాజీవ్ యువ వికాసం పథకం కింద 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 8,000 కోట్లు కేటాయించింది. నిరుద్యోగులనుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. కాంగ్రెస్ కార్యకర్త అయినా సరే.. అర్హత ఉంటేనే సాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సాయంతో నిరుద్యోగ యువత తమ కాళ్లపై తాము నిలబడి అటు తన కుటుంబానికి, ఇటు రాష్ట్రానికి వెన్నుదన్నుగా నిలిచేలా తెలంగాణ కాంగ్రెస్ సర్కారు అడుగులు వేస్తున్నది. రాజీవ్ యువ వికాసం స్కీమ్‌తో 5 లక్షల మంది నిరుద్యోగు యువకులు వ్యాపారస్తులుగా మారితే రాష్ట్ర జీడీపీ కూడా గణనీయంగా పెరుగనతుందని ఆయన తెలియజేశారు.

# పేదింటి వివాహాలకు ఆర్థిక సాయం అందించిన రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్





- రెండు కుటుంబాలకు మాజీ వైస్ -ఎంపీపీ ఆనంద్ 10000 ఆర్థిక సాయం

**కడ్తాల్, జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండలంలో జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు పేదింటి వివాహాలకు వరంగా మారుతున్నాయి. బుధవారం ఒక్కరోజే మూడు వివాహాలకు ఆర్థిక సాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీర మంగళసూత్రాలు ట్రస్ట్ చైర్మన్ మాజీ జెడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ అందించారు. మంగళపల్లి వసంత నరసింహ దంపతుల కుమార్తె ప్రజ్ఞ వివాహానికి 21000 తో పాటు పట్టుచీరను కానుక అందించారు. అనంతరం కేశమోని యాదమ్మ జంగయ్య దంపతుల కుమార్తె మౌనిక వివాహానికి 21000 ఆర్థిక సాయంతో పాటు పట్టుచీరను కానుకగా అందించారు. తదుపరి గుర్లకుంట గ్రామానికి చెందిన ఆంగోత్ నాన్కు రమేష్ దంపతుల కుమార్తె అఖిల వివాహానికి 21000 ఆర్థిక సాయంతో పాటు మేనమామ కట్నం కింద పట్టుచీరను కానుకగా అందించారు. దానికి తోడు మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ కేశమో కుటుంబానికి ఆముగోత్ కుటుంబానికి చేరు 5000 రూపాయల చొప్పున 10,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకుడు హన్మ నాయక్ ,డైరెక్టర్ నరేష్, మాజీ డైరెక్టర్ లయక్ అలీ, మాజీ వార్డ్ సభ్యులు మూడ అశోక్, రామచంద్రయ్య, మహేష్ నాయకులు అమృతం పాండు, మూడ బాలయ్య ,సురేష్, శ్రీను నాయక్ ,మోహన్, రవి, సిద్దిగారి వెంకటేష్, అంజి, శ్రీకాంత్, మూడ రవి ,రాఘవేందర్, గణేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు లేని పేదవారికి 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు చేయాలి




**కడ్తాల్, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల్ మండలంలో ఇండ్లు లేని పేదవారికి 'ఇందిరమ్మ ఇండ్లు' మంజూరు చేయాలని భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా ఇండ్లు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దోనాదుల మహేష్ మాట్లాడుతూ, నిరుపేదలు కనీస ఆవాస సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తమ సమస్యలను గమనించి తక్షణమే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు మాలె శ్రీశైలం గౌడ్, రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధి కంటేకర్ భగీరత్, మాన్యనాయక్, నింగ్యారి యాదగిరి, సిద్దిగారి కుమార్, నేనావత్ ప్రేమ్ కుమార్, గడ్డం వెంకటేష్, విక్రాంత్ చారి, తుప్పరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# షాద్ నగర్ సివిల్స్ ర్యాంకర్ భరద్వాజను సన్మానించిన తెలంగాణ గవర్నర్

-షాద్ నగర్ మాజీ సిడిపిఓ నాగమణి కుమారుడు భరద్వాజ్



**షాద్ నగర్,జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం సివిల్స్ ర్యాంకర్లను గవర్నర్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సన్మానించారు. బుధవారం రాజ్ భవన్ లో సివిల్స్ ర్యాంకర్లతో ఇన్స్పైర్ 2025 కార్యక్రమం జరిగింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన మాజీ సిడిపిఓ నాగమణి కుమారుడు భరద్వాజ్ సివిల్స్ లో 905 ర్యాంకు సాధించడం, ఐఏఎస్ గా గ్రూపు1 లో కూడా ఎంపిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర గవర్నర్ బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో భరద్వాజ్ ను సన్మానించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరి జీవితంలో గెలుపోటములు సాధారణమని, ఓటమి పాలయినప్పుడు నిరాశ చెందకుండా ముందుకెళ్లాలని సూచించారు. ఏటా తెలుగు రాష్ట్రాల నుంచి ఎక్కువ మందికి సివిల్స్ ర్యాంకులు వస్తున్నాయని, ఈ ఏడాది కూడా సెలక్ట్ అయ్యారని వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# లారీ ఢీకొని యువకుడు దుర్మరణం



**కల్వకుర్తి, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి పట్టణ పరిధిలోని కొండారెడ్డిపల్లి గేటు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కల్వకుర్తి నుంచి దేవరకొండ వెళ్తున్న లారీ అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జూపల్లి గ్రామానికి చెందిన చరణ్ (22) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు వెంటనే ఘటనను పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేశారు.

# పాత అలవాట్లు పక్కనపెట్టి పనిచేయండి

-అందరికీ అండగా ఉంటా

-ఆపదలో ఆప్తుడిగా వస్తా

-100 రోజుల అవగాహన కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



**వనపర్తి జూన్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి మున్సిపాలిటీలో పనిచేసే అధికారులు సిబ్బంది అందరూ వారి వారి పాతా అలవాట్లను పక్కకు పెట్టి పట్టణాభివృద్ధి కోసం పని చేయాలని మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న అండగా ఉంటానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం వనపర్తి మునిసిపాలిటీలో నిర్వహించిన 100 రోజుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వార్డు అధికారులుగా, మెప్మా ఆర్పీలుగా, జవాన్లుగా, మీరు నిరంతరం వనపర్తి పట్టణ ప్రజలకు అందించే సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వారిని అభినందించారు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి వనపర్తి జిల్లా కేంద్రం పై ఉందని త్వరితగతిన అభివృద్ధి చెందే వనపర్తి పట్టణాభివృద్ధిలో మీరందరూ భాగస్వాములు కావాలన్నారు. గతంలో మీరు ఎలా పనిచేశారన్నది పక్కకు పెడితే నేటి నుంచి నిబద్ధతతో పనిచేయాలని, విధి నిర్వహణలో మీ దృష్టికి వచ్చే పొరపాట్లను నివృత్తి చేస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఓటర్ లిస్ట్ పై ప్రత్యేక దృష్టి సారించి నిజమైన పట్టణ ఓటర్లను గుర్తించి, డబల్ ఎంట్రీలు ఉన్న వాటిని తొలగించాలని ఆయన సూచించారు. పని విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాచారంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**యాచారం, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్ )** రైతు సంక్షేమం కోసం యాచారంలో సకల హంగులతో నూతన రైతు బజార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు క్వాలిటీ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం యాచారంలో రైతు బజార్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.అనంతరం యాచారం రైతు వేదికలో రైతులకు నాన్యమైన విత్తనాలు అందజేశారు . ఈ కార్యక్రమం లో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి మాట్లాడుతూ.. మండలాన్ని కూరగాయల హబ్‌గా మార్చనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు నేరుగా ఇక్కడే అమ్ముకునేందుకు రైతు బజార్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఆర్డిఓ అనంతరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడిఏ సుజాత, తాహసిల్దార్ అయ్యప్ప, వ్యవసాయ శాఖ ఏవో రవినాథ్, రైతు కమిషన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు,యాచారం మండల రైతులు నాయకులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటన

**ఇబ్రహీంపట్నం జూన్ 4 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి 05/06//2025 గురువారం రోజు కార్యక్రమాలు. ఉదయం 10:30 ని నుండి నియోజకవర్గం లో పలు వివాహాలకు హాజరు అవుతారు. మధ్యాహ్నం 12:00 గం లకు ఇబ్రహీంపట్నం మండలం లోని నాగన్ పల్లి గ్రామం లో రెవిన్యూ సదస్సు కార్యక్రమం. మధ్యాహ్నం 12:30 ని లకు మంచాల మండలంలోని తాళ్ల పల్లి గూడా గ్రామం లో రెవిన్యూ సదస్సు కార్యక్రమం. మధ్యాహ్నం 1:30 ని లకు ఇబ్రహీంపట్నం మండలం లోని దండు మైలారం గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# ఇల్లు కల కాదు... నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-నర్కుడలో 85 మందికి ఇళ్లకు భూమిపూజ, ధృవీకరణ పత్రాల పంపిణీ

- పేదల కళ్లలో ఆనందం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో... పేదలకు సొంత ఇంటి కలను నిజం చేయాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. శంషాబాద్ మండలంలోని నర్కుడ గ్రామంలో 85 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనుల కోసం భూమిపూజ నిర్వహించడంతో పాటు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యుడు ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ"కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేదల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. ఇల్లు అనేది ప్రతి ఒక్కరి కల. అలాంటి కలను సాకారం చేసే ఘట్టానికి




మనం వచ్చాం. రూ. 5 లక్షల సహాయంతో ఇల్లు నిర్మించుకునే అవకాశం ఇవ్వడం దేశంలోనే ఉదాహరణకరం. ఇది పేదల జీవితం మార్చే నిర్ణయం." అని పేర్కొన్నారు.అలాగే, "ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగింది. నిజంగా అర్హులైన వారికి ఇళ్లు మంజూరయ్యాయి. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పథకం లబ్ధిదారులు సంతోషంతో స్పందిస్తూ తమ కలల ఇల్లు ప్రారంభమవుతోందంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# బూత్ స్థాయిలో మోదీ విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి కొండా విశ్వేశ్వర్ రెడ్డి







-శంషాబాద్‌లో బీజేపీ వర్క్‌షాప్ కీలక నేతల సూచనలు

**శంషాబాద్,జూన్ 4 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్రంలో బీజేపీ శక్తిని బలపరచేందుకు, కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలన్న లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో జిల్లా స్థాయి కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా రాష్ట్ర పార్టీ ఇంచార్జ్ అభయ్ పాటిల్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ అశోక్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవల మహేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,అభయ్ పాటిల్ మాట్లాడుతూ, "కేంద్రంలో 11 ఏళ్లుగా కొనసాగుతున్న మోదీ పాలన దేశంలో సామాన్యుడి జీవితాన్ని మారుస్తోంది. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి, ప్రతి ఓటరుకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది" అన్నారు.బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ మాట్లాడుతూ"యువత బలమే పార్టీ బలం. బీజేవైఎం శక్తిని పెంచేందుకు ప్రతి బూత్ స్థాయిలో యువ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి. మోదీ పాలనలో యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు ఎలా పెరిగాయో వివరించాలి. తెలంగాణలో యువతను బీజేపీ వైపు తిప్పే సమయం ఇదే," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, మండల, మున్సిపల్, కార్పొరేషన్ అధ్యక్షులు, బూత్ ఇన్చార్జులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బూత్ వారీ కార్యాచరణపై చర్చలు, ప్రణాళికలు రూపొందించడం జరిగింది. కేంద్ర పథకాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కల్పించారు.

# ఉపాధి హామీ పథకానికి సంబంధించినమెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలి

-అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశం

**వనపర్తి,జూన్ 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన మెటీరియల్ కాంపోనెంట్ పనులను త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జ్ యాదయ్య తో కలిసి ఉపాధి హామీ పథకము మెటీరియల్ కాంపోనెంట్ పనులపై సమీక్ష నిర్వహించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద వనపర్తి జిల్లాకు 23 నూతన గ్రామపంచాయతీ భవనాలు, 11 కమ్యూనిటీ మరుగుదొడ్లు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు రెండు, సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, స్వచ్ఛభారత్ కోష్ మంజూరు అయి ఉన్నాయని, వీటిని గ్రౌండింగ్ చేసేందుకు గ్రామ పంచాయతీలకు కేటాయించి స్థలం సేకరించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. స్థలం నిర్ధారించాక పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లను ఆదేశించారు. వన మహోత్సవ వర్షాలు ప్రారంభం అయినందున ఈ సంవత్సరం హరితహారం లో భాగంగా మొక్కలు నాటి కార్యక్రమంలో దృష్టి సారించాలని ఆదేశించారు.



ప్రతి గ్రామ పంచాయతీ ప్రధాన రహదారికి వచ్చి పోయే దారిలో 200 మొక్కల చొప్పున అందమైన మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. గ్రామంలో ఎక్కడెక్కడ మొక్కలు నాటేందుకు అవకాశాలు ఉన్నాయో సైట్ లు గుర్తించి పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ సంవత్సరము జిల్లాలో 44 కొత్త నర్సరీలు ప్రారంభించేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని వాటిని వెంటనే ప్రారంభించేందుకు ఆయా గ్రామ పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళు ప్రతి మండలంలో ఒక గ్రామ పంచాయతీనీపైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని మొదటి విడతలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు సైతం వెనువెంటనే ఖాతాలో జమచేయడం జరుగుతుందని, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరం అయితే లబ్ధిదారులకు మండలంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని చూపించాలని సూచించారు. నేటి ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలిలి ప్రపంచ పర్యవ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు అన్ని మండలాలు మున్సిపాలిటీలో పర్యావరణ దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టడం, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదనం కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జ్ యాదయ్య పంచాయతి రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు మల్లయ్య ఎంపీడీవోలు ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్.... సింధూరాన్ని తుడిచిన వారికి భారత్ ఇచ్చిన గట్టి సమాధానం

**ప్రజ్ఞాభారతి - ఆర్యవైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ అవగాహన సదస్సు**




**హైదరాబాద్, జూన్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేశ గౌరవాన్ని లక్ష్యంగా చేసుకుని భారత జవానులు చరిత్రలో నిలిచిపోయే సాహసాన్ని ప్రదర్శించిన ఆపరేషన్ సింధూరం అంశంపై ప్రజ్ఞాభారతి మరియు ఆర్యవైశ్య సేవా కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక వైశ్య భవన్లో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో పేరుగాంచిన రాజకీయ, రక్షణ విశ్లేషకుడు సిఏ గిరిధర్ మామిడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ం పెహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశవ్యాప్తంగా రగిలిన కోపాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా భారత సైన్యం ఆచరణలో చూపిన ప్రతిస్పందనకు రూపమే ఆపరేషన్ సింధూరమన్నారు. "మన మహిళల సింధూరాన్ని తుడిచిన పాకిస్తాన్‌కు సమర్థవంతమైన బదులు ఇవ్వడమే ఈ ఆపరేషన్ లక్ష్యం. ఉగ్రవాదులు ఎక్కడ దాగి ఉన్నా, వారిని అంతం చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ మాటలను మన సైనికులు యథార్థం చేశారు. ఆ మాటలు వాగ్దానంగా కాక, సైనిక చర్యలుగా మారిన ఉదాహరణే ఆపరేషన్ సింధూరం" అని గిరిధర్ మామిడి పేర్కొన్నారు. ఉగ్ర శిబిరాలు పీఓకే లోపలికి దూరంగా, గడ్డలపై నిర్మాణ స్థాయిలో ఉన్నప్పటికీ, వాటిని లక్ష్యంగా చేసుకుని భారత వైమానిక దళాలు సున్నితంగా, సమర్థంగా నిర్వహించిన దాడులను పాక్ నేతలే అంగీకరించారని గుర్తు చేశారు. ఈ దాడుల్లో పాకిస్తాన్‌కు మద్దతుగా ఉన్న చైనా తయారుచేసిన డ్రోన్లు, టర్కీ అందించిన యంత్రాంగం, అమెరికా సరఫరా చేసిన ఎఫ్-16 యుద్ధవిమానాలను, రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేయడం ద్వారా నాలుగు దేశాల సాంకేతిక అహంకారానికే గట్టి ఝలక్ ఇచ్చామన్నారు. ఇది కేవలం పాకిస్తాన్‌పై కాదు, పరోక్షంగా ఆ దేశాలకు కూడా భారత శక్తిని చాటిన విజయమేనని స్పష్టంగా చెప్పారు. ఇది పూర్తిగా భారత్‌లో తయారైన ఆయుధాల సహాయంతో సాధించగలిగిన ఘనతగా అభివర్ణించారు. "భారతదేశం ఒకవైపు శాంతి మార్గాన్ని అనుసరిస్తూనే, దేశ గౌరవాన్ని దెబ్బతీసే వారి పట్ల అసహనం చూపగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఈ ఆపరేషన్ ద్వారా ప్రపంచానికి తెలిసిపోయింది. ఇది యుద్ధం కాదు, ఓ ఘనమైన దేశభక్తి ప్రకటన" అని భావోద్వేగంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాభారతి ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు రాజ్య భాస్కర్ రెడ్డి, డి. నిరంజనాచారి, వైశ్య సేవా కేంద్రం అధ్యక్షులు చుండూరు సురేష్, డైరెక్టర్ కైలాస నవీన్, విద్యాసాగర్, సత్యనారాయణ రెడ్డి, మురళి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహాధర్నాకు తరలిన జాగృతి నాయకులు



**కల్వకుర్తి, జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్ కర్నూల్ జిల్లా జాగృతి అధ్యక్షుడు దారమోని గణేష్ నేతృత్వంలో కల్వకుర్తి జాగృతి నాయకులు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాకు బయలుదేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకు కాళేశ్వరం కమిషన్ పేరుతో నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, ప్రజా ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఈ మహాధర్నాకు జిల్లావ్యాప్తంగా జాగృతి నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాగృతి అధ్యక్షుడు దారమోని గణేష్, అజయ్, నవీన్, రాఘవ, ఉదయశంకర్, శ్రీను, నరేష్, ఉదయ్, అనిల్, రమేష్, సూరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పు సత్యనారాయణ జన్మ దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ ఐకాన్ అవార్డ్స్ ప్రధానం..







**-అంబరాన్ని అంటిన తెలంగాణ సంబరాలు...**
**--హాజరైన ఉపాధ్యాయ సంఘాలు...**






**హైదరాబాద్, జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ప్రముఖ సంఘ సేవకులు ఉప్పు సత్యనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఆవిర్భావ సంబరాల్లో భాగంగా ఆర్టీసి క్రాస్ రోడ్ లోని సిటీ కల్చరల్ సెంటర్ లో బుధవారం సాయంత్రం సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారులను, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలను, జర్నలిస్టును కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిఆర్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, టిఆర్టిఎఫ్ విశ్రాంత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కావలి అశోక్ కుమార్, గవిని రాంరెడ్డి, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ అసోసియేట్ జనరల్ సెక్రెటరీ ముత్యాల రవీందర్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో తమ వంతు పాత్ర అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో వారి వారి అనుభవాలను వివరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు, ఉద్యమకారూలకు ఉప్పు సత్యనారాయణ పుట్టినరోజును పురస్కరించుకొని తెలంగాణ ఐకాన్ అవార్డును ప్రధానం చేసి గౌరవించడం సముచితంగా ఉందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత సముచిత స్థానాన్ని ఉద్యమకారులకు ప్రభుత్వం కల్పించాలని



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడిసె రూబీ స్టీఫెన్ సన్, పిండిగ వెంకన్న అలియాస్ తెలంగాణ వెంకన్న ఆకాంక్షించారు. సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ అధ్యక్షులు మీనగా గోపి బోయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప్పు సత్యనారాయణ, అనురాధ దంపతులతో పాటు, సీఈఓ సి.పరమేశ్వరి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు ప్రముఖ నిర్మాత దర్శకులు పులి అమృత గౌడ్, టిఆర్ టి ఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా శాఖ అధ్యక్షులు గవిని గీతాదేవి, ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ అధికారి ముక్కాముల వెంకన్న, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ కానుగంటి కిషన్, శ్యాంసుందర్ రావు, ఎస్వి కళాశాల పూర్వ విద్యార్థులు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కొందుర్గ ప్రిన్సిపల్ కుర్షీద్, అక్కిరాజు దుర్గాప్రసాదరావు, మేడి జయరావు, పాలకుర్తి మధుబాబు, రైల్వే ఉద్యోగి సుభాష్, కొమరం భీమ్ సినిమా దర్శకుడు సేనాపతి పాల్గొని ప్రసంగించగా, నవీన్ యాంకర్ గా, గాయకునిగా అలరించారు. కార్యక్రమానికి ముందు గాయనీ గాయకులు తమ మధురమైన గొంతుతో పాటలతో అలరించారు. జయహే జయహే తెలంగాణ పాటతో ప్రారంభమైన కార్యక్రమం వందన సమర్పణతో ముగిసింది.

# కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరంలాంటిది

**- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి**





**ఇబ్రహీంపట్నం జూన్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాదీ ముబారక్ పథకాలు పేద ప్రజలకు వరంలాంటిదని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రతి పేద ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నం ప్రజా భవన్ (క్యాంపు ఆఫీస్)లో ఇబ్రహీంపట్నం మండలం మరియు మంచాల మండలాలకు సంబందించిన 202 మంది లబ్ధిదారులకు గాను 2 కోట్ల 2 లక్షల 23 వేల 432 రూపాయల కళ్యాణ లక్ష్మి & షాదీ ముబారక్ చెక్కులను చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద వారికి కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ ఎంతో అసరగా నిలుస్తుందన్నారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు

**పెబ్బేర్,జూన్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెబ్బేర్ మున్సిపల్ కేంద్రంలోని రేషన్ షాపు (2)ను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మొదటగా రేషన్ షాపు సమయానికి తెరుస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నారా లేదా అని డీలర్ రాణి ని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పంపిణీ అవుతున్న సన్న బియ్యం నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఇచ్చిన బియ్యం సరైన తూకంతో ఉన్నాయో లేదో అని తనిఖీ చేయడానికి కొంతమంది అందుకున్న బియ్యం ప్యాకెట్లను స్వయంగా తూకం వేసి సరిచూశారు. బియ్యం నాణ్యతను, డీలర్ వద్ద ఉన్న తూకాలను కూడా వ్యక్తిగతంగా పరిశీలించారు. అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు రేషన్ సరుకులు నాణ్యతగా, సక్రమంగా, సరైన తూకంతో అందేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని, ఇందులో ఎలాంటి లోపాలున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సన్న బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులకు విక్రయించరాదని డీలర్లను స్పష్టం చేశారు. రేషన్ షాపు డీలర్లు అన్ని రికార్డులను తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలని, నిబంధనలను పక్కాగా పాటించాలని, లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో, సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ ప్రజలకు మెరుగైన సేవలందించడంలో భాగంగా జరుగుతుందని ఆయన తెలిపారు.

# బిజినెస్

# టాటా హారియర్ ఈవీ వచ్చేసిందోచ్

## ప్రారంభ ధర రూ.21.49 లక్షలు
## సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు




**జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో నూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది.పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్-జోన్ ట్మెక్లెమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తిస్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నా యి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.

# మళ్లీ లక్షకు చేరువలో బంగారం ధర.. భారీగా పెరుగుతున్న పసిడి

**జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బంగారం ధరలు రోజురోజుకు ఎగబాకుతున్నాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు అంతకు రెండింతలు పెరుగుతోంది. తాజాగా నిన్న రూ.98,850 ఉన్న బంగారం ధర ప్రస్తుతం లక్షకు చేరువలో కొనసాగుతోంది. జూన్ 4 బుధవారం రూ.99,070 వద్ద ఉంది ఇక వెండి ధర విషయానికొస్తే లక్షా 200 రూపాయలు ఉంది. ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు లేదా స్థిరంగా కొనసాగవచ్చు. దేశంలోని ప్రధాన నగరాల్లో ధరల వివరాలు తెలుసుకుందాం.



చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.
ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.
ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,960 ఉంది.
హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.
బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.
కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.
విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.
అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ మార్కెట్ రేట్లు మన దేశంలో బంగారం ధరలపై ప్రభావం చూపుతాయి. ఇంకా అమెరికా డాలర్, రూపాయి మారక విలువ కూడా ఎఫెక్ట్ చూపిస్తుంది. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు కూడా బంగారం ధరలను నిర్ణయిస్తాయి. అందుకే గోల్డ్ ధరలు స్థిరంగా ఉండవు. ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి.

# మరో నయా ఈవీ స్కూటర్ లాంచ్‌కు బజాజ్ సిద్ధం.. ఈ నెలలోనే రిలీజ్..?

**జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బజాజ్ కంపెనీ జూన్ నెలలో బడ్జెట్ ఫ్రెండ్లీ చేతక్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బజాజ్ ఆటోకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ కంపెనీ ఆదాయాల సమావేశంలో చేతక్ 2903 మోడల్‌కు అప్‌డేటెడ్ వెర్షన్‌పై కంపెనీ పని చేస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త మోడల్ బజాజ్ ఈవీ అధికారికంగా జూన్‌లో ప్రారంభం కానుందని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం చేతక్ 2903, 3501, 3502, 3503 పేర్లతో నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంది. క్యూ4లో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలో అమ్మకాల చార్టుల్లో అగ్రస్థానంలో నిలిచిన తర్వాత బజాజ్ దాని సరసమైన శ్రేణిని మరింత వైవిధ్యపరచాలని కోరుకుంటోంది. చేతక్ బ్రాండ్‌కు



పెరుగుతున్న ప్రజాదరణ నేపథ్యంలో నాలుగో త్రైమాసికంలో భారతదేశ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో చేతక్‌ను నంబర్ వన్ స్థానానికి చేరింది. బజాజ్ ఈ-స్కూటర్ మార్కెట్‌లో 29 శాతం వాటాను కైవసం చేసుకుంది.బజాజ్ చేతక్ 2903 వెర్షన్ 2.9 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 123 కి.మీ.ల రేంజ్ తో పనిచేస్తుంది. ఇది 4 గంటల్లో 100 శాతం ఛార్జ్ అవుతుంది. అలాగే ఈ స్కూటర్ గరిష్టంగా 63 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని చెబుతున్నారు. అలాగే ఈ స్కూటర్ హిల్ హెూల్డ్‌తో పాటు రెండు రైడ్ మోడ్‌లను కలిగి ఉంటుంది. ఈ స్కూటర్ ధర ధర రూ. 98,498(ఎక్స్-షోరూమ్) ఉంటుంది. అయితే కొత్త అప్‌డేటెడ్ వెర్షన్ 35 సిరీస్ బ్యాటరీతో 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 153 కి.మీల పరిధితో వస్తుందని భావిస్తున్నారు. 35 సిరీస్ 3503కు సంబంధించిన ఎంట్రీ-లెవల్ మోడల్ ఆధారంగా కొత్త వేరియంట్ 35 లీటర్ల బూట్ స్పేస్, పెద్ద అండర్-సీట్ స్టోరేజ్, 63 కిలోమీటర్ల వరకు టాప్ స్పీడ్‌ను పొందవచ్చని అంచనా వేస్తున్నారు అలాగే బజాజ్ నయా స్కూటర్ ఇది 3 గంటల 25 నిమిషాల్లో 0 %-% 80 శాతం వరకు ఛార్జ్ అవుతుందని, అలాగే 151 కి.మీ.ల పరిధిని అందిస్తుందని వివరిస్తున్నారు. ఈ స్కూటర్‌లో రెండు రైడ్ మోడ్‌లు ఉంటయి.

# ఐపీఎల్‌లో లక్నో వైఫల్యం.. వరల్డ్ కప్ హీరోపై వేటు తప్పదా..!

**జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఐపీఎల్ 18వ సీజన్ ముగిసి రెండు రోజులైనా కాలేదు.. అప్పుడే కొన్ని జట్లు కోచింగ్ సిబ్బందిని మార్చే పనిలో పడ్డాయి. వరుసగా రెండు సీజన్లలో నిరాశపరిచిన లక్నో సూపర్ జెయింట్స్ తమ టీమ్‌లో మార్పులకు సిద్ధమవుతోంది. తమ ఫ్రాంచైజీ నిరుడు, ఈ ఏడాది ప్లే ఆఫ్స్ చేరకపోవడంతో చైర్మన్ సంజీవ్ గొయెంకా అసంతృప్తిగా ఉన్నాడట. సో.. కోచింగ్ స్టాఫ్‌లోని కొందరిపై వేటు పడనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. వీళ్లలో మెంటార్ జహీర్ ఖాన్ పేరు కూడా ఉండచవచ్చని లక్నో వర్గాలు చెబుతున్నాయి.టీమిండియా 2011లో వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో సభ్యుడైన జహీర్ ఖాన్ నిరుడు లక్నో కోచింగ్ యూనిట్‌లో చేరాడు. హెడ్‌కోచ్ జస్టిన్ లాంగర్‌తో కలిసి మెంటార్‌గా వ్యూహరచనలు చేశాడీ మాజీ పేసర్. అయితే.. 18వ సీజన్‌లో లక్నో తీవ్రంగా నిరాశపరిచింది. ఆరంభంలో అదరగొట్టినా.. కీలక




మ్యాచుల్లో ఓడిపోయింది. 14 మ్యాచుల్లో ఆరు విజయాలతో ప్లే ఆఫ్స్ బెర్తుకు దూరమైంది.వేలంలో రికార్డు ధర పలికిన కెప్టెన్ రిషభ్ పంత్ ఆఖరి మ్యాచ్‌లో సెంచరీ మినహా పెద్దగా రాణించలేదు. అతడిని సానబెట్టడంలో మెంటార్‌గా జహీర్ విఫలమయ్యాడని సంజీవ్ గొయెంకా భావిస్తున్నాడు. అయితే.. ఈ సీజన్‌లో భయం లేకుండా చెలరేగి ఆడాలని అనుకున్న లక్నో మైదానంలో మాత్రం తేలిపోయింది. మరోవైపు హిట్టర్ నికోలస్ పూరన్, మిడిలార్డర్‌లో సమద్ తేలిపోవడంతో ఆ జట్టు విజయావకాశాలు దెబ్బతిన్నాయి. దాంతో, వచ్చే సీజన్‌కు పక్కాగా సన్నద్ధం కావాలనే ఆలోచనతో ఉన్న ఆయన.. కొత్త మెంటార్ కోసం చూస్తున్నాడని టాక్. అదే నిజమైతే లక్నో మెంటార్‌గా జహీర్ పదవీ కాలం ఒక్క ఏడాదితో ముగియనుంది.

# టీమిండియాతో సిరీస్.. ఇంగ్లండ్‌ను వెంటాడుతున్న బౌలింగ్ కష్టాలు..!

**జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇంగ్లండ్ జట్టుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. టీమిండియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను విజయంతో ఆరంభించాలనే కసితో ఉన్న ఆతిథ్య జట్టుకు బౌలింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పేసర్ మార్క్‌వుడ్, జోఫ్రా ఆర్చర్ గాయపడ్డారు. క్రిస్ వోక్స్ సైతం ఫిట్‌నెస్ కోసం నానా పాట్లు పడుతున్నాడు. అంతలోనే యువ పేసర్ గస్ అట్కిన్సన్ సైతం గాయం పడ్డాడు. దాంతో ఇండియాతో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. కండరాల గాయం తో బాధపడతున్న ఈ స్పీడ్‌స్టర్ కోలుకునేందుకు సమయం పట్టడనుంది. సో.. జూన్ 20 మొదలయ్యే మొదటి టెస్టులో అతడు ఆడడం దాదాపు అసాధ్యమే.యువ పేసర్ గస్ అట్కిన్సన్ కుడి కాలి తొడకండరాల



గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అతడు ఇండియాతో జూన్ 20న జరుగబోయే తొలి టెస్టుకు దూరమయ్యే అవకాశముంద'ని ఇంగ్లండ్ బోర్డు తెలిపింది. స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టులో అట్కిన్సన్ గాయపడ్డాడు. దాంతో.. అతడు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు.ఇప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లో భాగంగా టీమిండియాతో సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండకపోవచ్చు. ఒకవేళ తొలి టెస్టులోపు అట్కిన్సన్ కోలుకొని, ఫిట్‌నెస్ సాధించకుంటే ఇంగ్లండ్‌కు వైవిధ్యమైన పేస్ బౌలర్ కొరత ఏర్పడనుంది. నిరుడు వేసవిలో అరంగేట్రం చేసిన అట్కిన్సన్ 12 మ్యాచుల్లోనే 55 వికెట్లు పడగొట్టాడు.

# స్పోర్ట్స్

# ఐసీసీ ట్రోఫీల వీరుడి కల సాకారం..

## ఐపీఎల్ టైటిల్‌తో కోహ్లీ 'సిక్సర్'..!



**జూన్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ కల సాకారమైంది. టీమిండియా ఆటగాడిగా పలు ఐసీసీ ట్రోఫీలు గెలుపొందిన విరాట్.. ఐపీఎల్‌లోనూ 'ఛాంపియన్' అనిపించుకున్నాడు. 17 ఏళ్లుగా తనను ఊరిస్తూ వస్తున్న ట్రోఫీని అహ్మదాబాద్ స్టేడియంలో ఎంతో మురిపెంగా చేతపట్టుకున్నాడు విరాట్. తన సుదీర్ఘ కెరియర్‌లో అందని ద్రాక్షలా మిగిలిన ఐపీఎల్ ట్రోఫీతో విరాట్ చేసిన సంబురం అంతా ఇంతా కాదు. ఆటగాడిగా ఎన్నో మైలురాళ్లు, రికార్డులు అధిగమించిన భారత క్రికెట్ స్టార్ వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ గెలుపొందిన భారత జట్టులో సభ్యుడు. ఐపీఎల్ విజేతగా నిలిచిన అతడి ఖాతాలోని టైటిళ్ల సంఖ్య ఆరుకు చేరిందిటీమిండియా తరఫున విజయవంతమైన ఆటగాళ్లలో ఒకడైన కోహ్లీ ఐసీసీ ట్రోఫీల వీరుడిగా పేరుగాంచాడు. అండర్ - 19 వరల్డ్ కప్ (U-19 World Cup 2008) హీరోగా సీనియర్ జట్టులోకి వచ్చిన అతడు.. అనతికాలంలోనే కీలక ఆటగాడిగా ఎదిగాడు. స్వదేశంలో జరిగిన 2011లో వన్డే వరల్డ్ కప్‌తో తొలి ఐసీసీ టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు కింగ్. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ, 2024లో టీ20 వరల్డ్ కప్, 2025లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపొందని జట్టులో సభ్యుడైన కోహ్లీ.. ఇప్పుడు ఐపీఎల్ ట్రోఫీతో సిక్సర్ కొట్టాడు.